# వంట నూనెల మంట

### నెల రోజుల్లోనే భారీగా పెరిగిన ధరలు
### పండుగల వేళ సామాన్యులపై భారం



**వంట నూనెల ధరల వివరాలు (రూ.ల్లో)**

| రకం | గత నెలలో | ఇప్పుడు |
|---|---|---|
| పామాయిల్ | 100 | 137 |
| సోయాబీన్ ఆయిల్ | 120 | 148 |
| సన్‌ఫ్లవర్ ఆయిల్ | 120 | 149 |
| ఆవనూనె | 140 | 181 |
| పల్లి నూనె | 180 | 184 |

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): పండుగ రోజుల్లో వంట నూనెల ధరలు అమాంతం పెరుగుతున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే పామాయిల్ ధర 37%, ఆవనూనె 29%, సోయాబీన్, సన్‌ఫ్లవర్ ఆయిల్ రేట్లు 23% చొప్పున, పల్లి నూనె ధర 2% మేర పెరిగాయి. గత నెలలో రూ.100 పలికిన లీటర్ పామాయిల్ ధర ఇప్పుడు రూ.137కి చేరగా.. సోయాబీన్ నూనె ధర రూ.120 నుంచి రూ.148కి, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర రూ.120 నుంచి రూ.149కి, ఆవనూనె ధర రూ.140 నుంచి రూ.181కి, వేరుశనగ నూనె ధర రూ.180 నుంచి రూ.184కి పెరిగింది. దీంతో సామాన్య ప్రజలతోపాటు రెస్టారెంట్లు, హోటళ్లు, స్వీట్ షాపుల యజమానులు, చిరుతిళ్ల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశీయంగా నూనె గింజల సాగు పెద్దగా లేకపోవడంతోపాటు దిగుమతి సుంకాలను కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచడం, ద్రవ్యోల్బణం అధికమవడమే ఇందుకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. గత నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.5 శాతానికి ఎగబాకి 9 నెలల గరిష్ఠ స్థాయికి చేరింది. దీంతో వంట నూనెల ధరలతోపాటు కూరగాయలు, ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగాయి.

**దిగుమతి సుంకాలు భారీగా పెంపు**

కేంద్ర ప్రభుత్వం గత నెలలో ముడి పామాయిల్, సోయాబీన్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతానికి, శుద్ధి చేసిన వంట నూనెలపై 13.7 శాతం నుంచి 35.7 శాతానికి పెంచింది. ప్రపంచవ్యాప్తంగా వాటి ధరలు వరుసగా 10.6%, 16.8%, 12.3% మేరకు పెరగడమే ఇందుకు కారణమని అధికారులు తెలిపారు.

# పడకేసిన కీలక రంగాలు

### సెప్టెంబర్‌లో 2 శాతానికి పరిమితమైన వృద్ధి

న్యూఢిల్లీ, అక్టోబర్ 30:కీలక రంగాల్లో నిస్తేజం కొనసాగుతున్నది. గత నెలకుగాను ఎనిమిది కీలక రంగాల్లో వృద్ధి 2 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 9.5 శాతం వృద్ధితో పోలిస్తే భారీగా తగ్గిందని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఆగస్టులో మైనస్ 1.6 శాతం నమోదైన వృద్ధి ఆ మరుసటి నెలలో పుంజుకోవడం విశేషం. క్రూడాయిల్, సహజ వాయువు, విద్యుత్ రంగాల్లో ప్రతికూల వృద్ధి నమోదు కావడం వల్లనే కీలక రంగాల్లో నిస్తేజం నెలకొన్నదని తెలిపింది. అలాగే బొగ్గు, ఎరువులు, స్టీల్ రంగాలు తిరిగి కోలుకోవడం వల్లనే ఈ మాత్రమైన వృద్ధిని సాధించాయి. సిమెంట్ రంగం 7.1 శాతం, రిఫైనరీ 5.8 శాతం వృద్ధిని సాధించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో కీలక రంగాల్లో వృద్ధి 4.2 శాతంగా ఉన్నది. మొత్తం పారిశ్రా



మిక వృద్ధిరేటులో 40 శాతం వాటా కలిగిన కీలక రంగాలు నిస్తేజం నెలకొనడంతో దేశీయ తయారీ రంగంపై ప్రతికూల ప్రభావం చూపనున్నది. దేశవ్యాప్తంగా అత్యధికంగా వర్షాలు కురియడంతో గనులు, విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయం ఏర్పడటంతో మొత్తం కీలక రంగాలపై ప్రతికూల ప్రభావం చూపిందని ఇక్రా చీఫ్ ఆర్థికవేత్త అదితి నాయర్ తెలిపారు. మరోవైపు, సిమెంట్ ఉత్పత్తి ఆరు నెలల గరిష్ఠ స్థాయిని తాకింది.

# గోల్డ్ @ రూ.82,400

### ఆల్‌టైమ్ హైకి తులం బంగారం ధర • ఒక్కరోజే రూ.1,000 పెరుగుదల
### మార్కెట్‌లో దీపావళి ఉత్సాహం • జ్యుయెల్లర్స్ నుంచి భారీగా డిమాండ్



***బంగారం ధరలు ఆకాశమే హద్దుగా పెరిగిపోతున్నాయి.*** ఒక్క రోజే ఏకంగా రూ.1,000 ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా రూ.82,400 స్థాయిని చేరింది. దీపావళి సందర్భంగా ఆభరణాల వర్తకుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ రావడమే ధరలు ఈ స్థాయిలో పెరగడానికి కారణమని మార్కెట్ నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.

***మునుపెన్నడూ లేని రికార్డు స్థాయిలను అధిరోహిస్తున్నాయి. ఈ క్రమంలోనే మరో సరికొత్త శిఖరాన్ని పుత్తడి విలువ చేరింది.***

***దీపావళి తెచ్చిన ఉత్సాహమో.. స్టాక్ మార్కెట్లలో నష్టాల భయమో.. కారణం ఏదైనా దేశీయ విపణిలో తులం రేటు తొలిసారి రూ.82,000 మార్కును దాటేసింది.***

న్యూఢిల్లీ, అక్టోబర్ 30: బంగారం ధరలు దేశీయంగా మరో ఆల్‌టైమ్ హైని నెలకొల్పాయి. బుధవారం 99.9 స్వచ్ఛత (24 క్యారెట్) కలిగిన గోల్డ్ రేటు 10 గ్రాములు న్యూఢిల్లీలో తొలిసారి రూ.82,000 మార్కుకు ఎగువన నమోదైంది. మంగళవారం ముగింపుతో పోల్చితే

**హైదరాబాద్‌లో..**

హైదరాబాద్‌లో 24 క్యారెట్ పసిడి ధర తులం రూ.81,160గా ఉన్నది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) పుత్తడి రూ.74,400 పలుకుతున్నది. మంగళవారంతో చూస్తే వరుసగా రూ.710, రూ.650 చొప్పున ఎగిశాయి. కాగా, ఈసారి ధనత్రయోదశి అమ్మకాలు అంతంతమాత్రంగానే సాగడానికి అధిక ధరలే కారణమని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో రేట్లు ఒక్కరోజే ఇంతలా పెరగడం.. కొనుగోళ్లను ఇంకా తగ్గిస్తాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి. నిజానికి గడిచిన ఏడాది కాలంలో బంగారం ధరలు 35 శాతం పెరిగాయి. నిరుడు అక్టోబర్ 29న 10 గ్రాముల 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ.61,200గా ఉన్నది. దీంతో రూ.21,200 పెరిగినట్టైంది.

**మెరిసిన వెండి**

వెండి ధరలూ పరుగులు పెట్టాయి. ఈ ఒక్కరోజే రూ.1,300 పుంజుకొని కిలో ధర రూ.1.01 లక్షల వద్ద నిలిచింది. దేశీయ మార్కెట్‌లో కిలో వెండి విలువ గత బుధవారం మొదటిసారి రూ.1.02 లక్షలు పలికిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే గత ఏడాది అక్టోబర్ 29న కిలో వెండి రేటు రూ.74,000గా ఉన్నది. దీంతో గడిచిన ఏడాది కాలంలో రూ.27,000 పెరిగినట్టైంది. ఇక గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు పసిడి ధర 16.80 డాలర్లు పెరిగి 2,797.90 డాలర్లను తాకింది. వెండి 34.45 డాలర్లు పలుకుతున్నది.

> పండుగ సీజన్ కావడంతో దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. దీనికితోడు అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధిస్తారన్న అంచనాలు పెరుగుతుండటం అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ధరలను ఎగదోస్తున్నాయి. స్టాక్ మార్కెట్లు నష్టాల్లో సాగుతుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షిత సాధనాల్లోకి మళ్లిస్తుండటం కూడా పసిడికి మరింత డిమాండ్‌ను తీసుకొచ్చింది. స్థానిక జ్యుయెల్లర్స్ నుంచి కొనుగోళ్లు పెరగడం, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలూ ధరలకు రెక్కల్ని తొడుగుతున్నాయి.
>
> ***-జతిన్ త్రివేది, ఎల్‌కేపీ సెక్యూరిటీస్***


## ధరలు పెరిగినా తగ్గని డిమాండ్..

ప్రపంచ స్వర్ణ మండలి నివేదిక ప్రకారం

- గత ఏడాదితో పోల్చితే ఈ జూలై-సెప్టెంబర్‌లో భారత్‌లో గోల్డ్ డిమాండ్ 18 శాతం పెరిగి 248.3 టన్నులకు చేరిక. పోయినసారి 210.2 టన్నులే. విలువపరంగా రూ.1,07,700 కోట్ల నుంచి రూ.1,65,380 కోట్లకు పెరుగుదల.
- బంగారం దిగుమతులపై సుంకాల తగ్గింపు కలిసొచ్చింది. పెండ్లిళ్ల సీజన్ కూడా అమ్మకాలకు దోహదపడింది.
- ధరలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటంతో వేచిచూసే ధోరణిలోకి పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు.
- 2023 మొత్తంగా దేశీయ పసిడి విక్రయాలు 761 టన్నులు. ఈ ఏడాది 700-750 మధ్యే ఉండొచ్చని అంచనా.
- ఈ జూలై-సెప్టెంబర్‌లో నగల కొనుగోళ్లు 10 శాతం పెరిగి 171.6 టన్నులుగా నమోదు. పోయినసారి 155.7 టన్నులే.
- పెట్టుబడులు 76.7 టన్నులు. గత ఏడాది జూలై-సెప్టెంబర్‌లో 54.5 టన్నులుగానే. మొత్తం రీసైక్లింగ్ చేసిన గోల్డ్ కూడా నిరుడుతో చూస్తే 19.2 టన్నుల నుంచి 23.4 టన్నులకు చేరిక.
- ఈ జూలై-సెప్టెంబర్‌లో దేశంలోకి 360.2 టన్నుల పసిడి దిగుమతులు. క్రిందటిసారి 193 టన్నులే. 13 టన్నులను కొన్న ఆర్బీఐ. 854 టన్నులకు చేరిన పసిడి నిల్వలు.
- ప్రపంచవ్యాప్తంగా ఈ జూలై-సెప్టెంబర్‌లో గోల్డ్ డిమాండ్ 1,313 టన్నులు. పెట్టుబడుల డిమాండ్ 364 టన్నులు. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకే 95 టన్నులు.
- బంగారం కడ్డీలు, నాణేలకు తగ్గిన ఆదరణ. సెంట్రల్ బ్యాంకుల నుంచీ డిమాండ్ సగానికి పతనం. ఈ 3 నెలల్లో 186.2 టన్నులనే కొన్న ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు.
- ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో దేశంలోకి 21.78 శాతం పెరిగి 27 బిలియన్ డాలర్లకు చేరిన పుత్తడి దిగుమతులు. స్విట్జర్లాండ్ (దాదాపు 40 శాతం), యూఏఈ (16 శాతానికిపైగా)ల నుంచే ఎక్కువగా రాక. వెండి దిగుమతుల విలువ 2.3 బిలియన్ డాలర్లు.

# 80 వేల దిగువకు సెన్సెక్స్

### 400 పాయింట్లకు పడిపోయిన సూచీ



ముంబై, అక్టోబర్ 30: దేశీయ స్టాక్ మార్కెట్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బేరిష్ ట్రెండ్ కొనసాగుతుండటంతో మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో సెన్సెక్స్ 80 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం మార్కెట్లో సెంటిమెంట్‌ను నిరుత్సాహపరిచింది. 80,435 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 426.85 పాయింట్ల నష్టంతో 79,942.18 వద్ద ముగిసింది. అటు మరో సూచీ నిఫ్టీ సైతం 126 పాయింట్లు కోల్పోయి 24,340.85 వద్ద నిలిచింది.

- ఇన్ఫోసిస్ షేరు 2 శాతానికి పైగా నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- దీంతోపాటు హెచ్‌సీఎల్ టెక్, ఐసీఐసీఐ బ్యాంక్, కొటక్ బ్యాంక్, మహీంద్రా, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, టాటా మోటర్స్, భారతీ ఎయిర్‌టెల్‌లు నష్టపోయాయి.
- మారుతి షేరు 2 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, అల్ట్రాటెక్, టైటాన్, ఐటీసీ, నెస్లే, రిలయన్స్, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్‌లు లాభాల్లో ముగిశాయి.




# హైదరాబాద్‌లో సీలి పరుపుల ప్లాంట్

హైదరాబాద్, అక్టోబర్ 30: అంతర్జాతీయ పరుపుల విక్రయాల్లో అగ్రగామి సంస్థల్లో ఒకటైనా సీలి..రాష్ట్రంలో తన తొలి ప్లాంట్‌ను ప్రారంభించింది. హైదరాబాద్‌కు సమీపంలోని మేడ్చల్ జిల్లాలో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ యూనిట్‌ను నెలకొల్పింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 60 యూనిట్లలో ఇదే చిన్నది కావడం విశేషం. దేశీయంగా ప్రీమియం పరుపులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని తొలి విడుత ఇక్కడ యూనిట్‌ను ప్రారంభించినట్లు, భవిష్యత్తులో తన వ్యాపారాన్ని విస్తరించనున్నట్లు సీలే ఇంటర్నేషన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సీఈవో సీన్ సీమన్ డెయర్ తెలిపారు.

